# నేరమూ-శిక్షా

"నన్ను కోర్టులో హాజరుపరిచినప్పుడు నీ కనులు ఆనందంతోనూ, గర్వంతోనూ మెరిసిపోయాయి. నిన్ను నీ పై అధికారి అభినందిస్తూంటే నరనరాల్లో నీరక్తం వేడెక్కి ఉరకలు వేసి ప్రవహించింది. ముసలితనంలోకూడా నీ మొహంలోని ముడతలు క్షణంపాటు మాయమైనాయి. నామీద శిక్ష ధృవీకరింబడుతూంటే నీకు ఆనందంతో కళ్ళు చెమ్మగిల్లాయి. అవును. నాకోసం నువ్వు ఇన్నాళ్ళూ పడిన శ్రమా ఫలించింది. పై అధికారులు నీకు ఇచ్చిన పనిని తెలివిగా నెరవేర్చి నువ్వు వారిని సంతృప్తి పరిచావు.

"నిజమే, ఇది నిజంగా సామాన్య విషయంగాదు. దాదాపు పదేళ్ళపాటు ప్రజలకీ, ప్రభుత్వానికి కంటకప్రాయమైన ఒక దోపిడీగానిని చాకచక్యంగా బంధించి అతనిమీద నేరాలు ఆరోపించి ఋజువుచేయించావు. నీ ముప్ఫయి సంవత్సరాల సర్వీసును విశ్వాసపాత్రుడవుగా, సమర్థతతో నెరపి

నావనుటకు ఉద్యోగ విరమణకాలం దగ్గరపడుతున్న ఈ సమయంలో నువ్వు ఒనర్చిన ఈ సాహసకార్యం నిదర్శనం కాగలదు. దీనికి నిన్ను అభినందిస్తున్నాను"

"స్కాండల్!" విసురుగా కాగితాలని నేలకేసి కొట్టాడు. ఇన్‌స్పెక్టర్ రాజారావు. ఇదేమాటలు ఓ పై అధికారి రాసివుంటే అతను ఎంతయినా ఆనందించి ఉండేవాడు కాని తనచేతి పట్టుబడి శిక్షించబడిన ఒక దోషినుంచి తనకి అభినందన సందేశమా? అతనికి కోపంతో శాటు ఆశ్చర్యం కూడా కలిగింది. ఇలాంటి సంఘటన తన ముప్పయి సంవత్సరాల సర్వీసులో ఎక్కడా వినలేదు.

నౌకరు తలుపుతోసుకుని లోనికి వచ్చాడు కాఫీ "ట్రే" తో. ట్రే స్టూలుమీద పెట్టి పక్కసర్ది దుప్పట్లు మార్చాడు. కిటికీ తెరలుదించి తలుపు మూశాడు. "యాష్ ట్రే" తీసుకెళ్ళి శుభ్రంచేసి తీసుకొనివచ్చి తిరిగి యథాస్థానంలో ఉంచాడు సిగరెట్ 'పాకెట్'లు మరో రెండు తెచ్చి టేబులుమీద అమర్చాడు. ఇంకా ఏమయినా కావాలేమో నని కాసేపు నిలబడి యేమీ ఆజ్ఞ లేకపోవటంతో తలుపు మూసి బయటికి వెళ్ళిపోయాడు.

పెద్దపిల్ల 'కనే' రోజులని సుందరమ్మ వెళ్ళి పదిరోజులయింది ఇంకా రావటానికి ఓ ఇరవైరోజులు పట్టవచ్చు. ఆవిడా పిల్లలూవుంటే తోచకపోవడమంటూ ఉండేదిగాదు. తొమ్మిదిగంటలదాకా కాలక్షేపంచేసి, భోజనం అయింతరవాత పదిన్నరవరకూ చదువుకుని నిద్రపోయేవాడు. ఈ కేసు

కాస్తా అయిందనిపించాక వెసులుబాటు కనిపించటంతో తోచకపోవటం అంటూ మొదలయింది.

ఇవాళ ఎందుకో రాజారావు మనసు మామూలుగా లేదు. అంతరాంతరాలలో ఏదో తెలీని ఆందోళన కారు మబ్బులా పట్టుకు రాకముందు దిక్చక్రంమీద చిన్ని మబ్బు తునకలా అల్లలాడుతోంది. సిగరెట్టు వెలిగించి కప్పు కాఫీ తాగి, సిగరెట్ పొగవదులుతూ కాసేపు కూర్చున్నాడు రాజారావు.

సాయంత్రం ఈ ఉత్తరం మీకివ్వమన్నారంటూ తీసుకొచ్చి ఇచ్చాడు ఆఫీసరుగారి జవాను. ఏమిటని చూస్తే దానిమీద ఆయన రాశారు. తను ఎవరిని అతి చాకచక్యంతో పట్టుకుని డిపార్టుమెంటుకి పేరు తీసికొనివచ్చాడో ఆ దోషిని నిన్న ఉరి తీశారుట. అతన్ని ఉరితీయబోయేముందు చివరికోరిక యేమిటని అడిగారుట. అతను ఈ ఉత్తరం ఇచ్చి రాజారావుగారికి అందజేయమని కోరేడట. అందువలన దానిని తనయినా చూడకుండా పంపుతున్నానని రాశారు.

నవ్వుకున్నాడు రాజారావు. అధికారికి తనంటే మంచిగురి యేర్పడుతోందన్నమాట. అతను కుర్రవాడు, ఆలిండియా కాంపిటీషనులో సర్వీసుకి సెలక్టు అయినాడట. తెలుగువాళ్ళలోకూడా సెలక్టవుతున్నారని తెలుసుకుని సంతోషించాడు తను. మంచి తెలివీ, చురుకుదనమూ కలిగిన మనిషి వయస్సులో చిన్నవాడయినా బుద్ధిలో పెద్దవాడు.

అయినా ఆ ముద్దాయి తనకి ఇవ్వమంటూ ఉత్తరం ఆఖరు కోరికగా పంపడమేమిటి? అతనికి మొహం ఇప్పటికీ

గుర్తుంది తనకు. గండు మొహం మశూచికపు మచ్చలు. ఒక కన్ను పువ్వేసిపోయింది, అతడు చేసిన పాపాలన్నీ కలిపి మొహంమీద మచ్చలన్నీ ఉంటాయేమో.

అప్పటిదాకా సన్నగా పడుతున్న చినుకులు ఆగిపోయాయి. చలిగావుంది. ఈ సమయంలో సుందరీ, పిల్లలూ ఉంటే యెంత బాగుండును అనుకున్నాడు. కాస్సేపు పచార్లు చేసి తిరిగి కుర్చీలో కూర్చుని నేలమీద విసిరికొట్టబడిన కాగితాలు తీశాడు.

"నాకు వూహ తెలిసి వచ్చేటప్పటికి ఎవరూ తెలియదు. ఏకాకిని. ఈ ప్రపంచంలో నాకు 'నా అనే వాళ్ళెవరూ లేరు. కాని నా చిన్ననాటి చరిత్ర అస్పష్టమయిన వూహా చిత్రంలా యింకా మెదులుతున్నది, నా కనులముందు, అదే మీకు తెలియజేసుకుని మీనుంచి న్యాయాన్ని పొందాలని ఆశిస్తున్నాను.

ఈ విషయాలు చిన్నప్పుడు వాళ్ళనించీ, వీళ్ళనించీ విని చెవరిగ్గున్న సంఘటనలని వరుసగా పేర్చి మీ ముందు పెడుతున్నాను జ్ఞాపకం చేసుకుని.

"మా అమ్మ కాలేజీ చదువు చదువుకున్నదట. ఎంత చదువుకున్నా ఆడది ఆడదేగదా! అయితే ఆవిడ సంపన్నుల బిడ్డ. చిన్నప్పట్నించీ గారాబంగా పెరిగింది. తల్లిదండ్రులు చిన్నప్పుడే పోయినా కొండంత అన్నయ్యే అన్నీ గావుంటూ అమ్మను చూసుకున్నాడట. ఆవిడ అలా పెరిగి కాలేజీలో ప్రవేశించిందన్నానుగా! వివరం తెలీని యీడు. ప్రపంచం

పోకడ సరిగా అర్థంకాని వయస్సు ఆ రోజులలో ఆ కాలేజీలోనే బి. ఏ. చదువుతూన్న ఒక వయసుకాడిని ప్రేమించిందట. అతడూ ఆమెని ప్రేమించాడట. అయితే యౌవనంలో ఉన్నారేమో ప్రేమించడానికీ. కామించడానికి తేడా లేదనుకుని కామించుకుంటూ ప్రేమించుకున్నారుట రహస్యంగా. అయితే దాని పరిణామమేమిటో నేను మా అమ్మకడుపులో పడినప్పుడుగాని తెలియలేదట వాళ్ళిద్దరికీ..." ఈలా అని ఒకనాడు నేను బజార్లో ఆడుకుంటూండగా సంస్కారవంతుడుగా పేరుమోపిన ఒక పెద్దమనిషి, ధర్మావలంబకుడనని చెప్పుకుంటున్న మరో మనిషితో చెబుతున్నాడు చూపించి ఆ మాటల అర్థం నాకు అప్పట్లో తెలియలేదు.

తరువాత యెలాగో ఈ సంగతి తెలిసిన మామయ్య అమ్మని నిగ్గదీసి అడిగితే నిజమేనని కన్నీరు కారుస్తూ ఉండిపోయిందట. చేతులు కాల్చుకుని, ఆకులు పట్టుకున్నా ఫలితం లేక ఏ ఆడదైనా చెయ్యగలిగింది అంతేగా (ట) అయితే మా మామయ్య తొందర పడలేదు. వాళ్ళ వూరు వెళ్ళి విచారించాడట. ఆయనకి అదివరకే వివాహం అయిందనీ, భార్య వ్యక్తురాలు కాలేదని ఇంకా కాపురానికి పంపలేదని తెలిసిందట. ఏదోవిధంగా ఆమె బ్రతుకును అతికిద్దామని ఆశతో వెళ్ళిన మామయ్య నిరాశతో నెత్తిన 'కర్చీపు' వేసుకుని వచ్చాడుట! మనబంగారం మంచిదిగాదు అయినా ఇదేమిటని అతన్ని (మా నాన్నని) ఇంటికిపిలిచి నిలదీసి అడిగితే నిరుత్తరుడై బిక్కమొహం వేశాడట. మా అమ్మ కన్నీరు మున్నీ

రుగా ఏడుస్తూంటే వోదార్చే ఆడదిక్కులేక సతమతమయే వాడుట మామయ్య. తరవాత నేను కడుపులో ఉండగానే మామయ్య భార్య కాపురానికి వచ్చిందట. అప్పట్నుంచీ మా నాన్న మళ్ళీ ఆ వూళ్ళో కనబడలేదుట యెవరికీ. అంతకంటే ఏమిచెయ్యగలడు చాతికానివాడు.

ప్రపంచంలో ఆడబ్రతుకు 'ఆడబ్రతుకు'గా తయారవటానికి ఆడదే కారణమట! (కాదా ?) తన సొంత చెల్లెలు జారి తప్పుచేసినా కడుపులో పెట్టుకునే పాటి క్షమ, దయ మామయ్యలో వున్నాయి. అయితే ఇరుగమ్మా పొరుగమ్మా, సీతమ్మా, చంద్రమ్మా చేరి అమ్మ కనబడితే చాలు మూతీ ముక్కు విరుచుకుని, కాకుల్లా కాలక్షేపం చేసేవారట. నీతి నియమాల విషయంలో పలుకుబడి హోదా పనికిరావు కదా!

ఈ బాధ భరించలేక, అమ్మ కుమిలి కుమిలి ఏడ్చేదిట. తరువాత ఒక నెల్లాళ్ళకి నాకీ జన్మ వద్దు మొర్రో" మని ఏడుస్తూ యెవరికీ అవసరంలేని నేను వూడిపడ్డానుట ఈ ప్రపంచంలోకి. ఎద్దు పుండుతో బాధపడుతోంటే దాన్ని ముక్కుతో పొడిచి ఆనందించడం కాకుల సరదా. అలాటిది ఈ లోకం. ఇట్లా కాకుల మధ్య ఓ సంవత్సరం పెరిగాను నేనూ ఓ కాకినై.

ఈ లోకుల బాధ రోజూ మరీ యెక్కువై పోవడంతో భరించలేక అమ్మ, మామయ్యతో కూడా చెప్పకుండా ఓ నాటి తెల్లవారు ఝామున మా నాన్నగారివూరికి రైలెక్కిం

దట. వెంట మెవరూ లేకుండా, కొండంత ఆశతో, కనీసం భర్తఇంట్లో పనిమనిషిగా అయినా కాలంగడుపుదామని.అప్ప టికే ఆయన ఓ వుద్యోగం చూసుకుని, భార్యతోసహా మరో ప్రాంతానికి వెళ్ళిపోయాడుట. ఆ వూరుపేరు చెప్పడానికీ, పోనీ తను తోడయినా ఉండటానికీ వాళ్ళవాళ్ళు సుతరామూ ఒప్పుకోలేదుట. ఇట్లా వుంటవి బాధ్యత తెలీక చేసినపనులు. ఇట్లా తను కావాలనుకున్నట్లు దూరముకాగా, తను కావా లనే వాళ్ళ దగ్గరకి వెళ్ళటానికి మొహం చెల్లక జీవితంలో రెండోసారి ధైర్యంచేసి నన్ను తీసుకుని వెళ్ళిపోయిందిట, తన్ను తెలిసిన వాళ్ళు లేనిచోటికి!

అంతవరకూ తను చదువుకున్న చదువు జీవితానికి ఆధారం చేసుకుని ఒక ఎలిమెంటరీస్కూల్లో చదువు చెబుతూ నన్ను చూసుకుంటూ కాలం గడిపేదిట. కాని విధి చూసి ఓర్వలేకపోయింది. మూలిగే నక్కమీదే పడుతుంది తాటి పండు. నేను ఐదో తరగతి చదువుతూండగా ఆ ప్రాంతాల భయంకరమైనక్షామం సంభవించింది. దానికి తోడు మశూచి విపరీతంగా పోసి అమ్మ రెండురోజులలో తన బ్రతుకుచాలిం చింది. ఆ సమయంలోనే నాకూ మశూచిపోసి. ఒక కన్ను పువ్వేసిపోయింది. తరతరాలుగా స్త్రీ మీద పురుషుడు చేస్తున్న అక్రమాలకి ప్రతిబింబమయిన నా మొహంమీది ఈ మచ్చలు నా తరువాతి జీవితానికి సూచనలై ఉద్భవించాయి. పుడుతూనే 'జన్మదాత' జీవితంలో అశాంతిని సృష్టించి ఆమె చనిపోయినా నేనుమాత్రం మొండిగా బ్రతికే ఉన్నాను.

నన్ను ఆ నాల్గురోజులూ చూసుకున్నారు. ఎవరు మాత్రం ఎన్నాళ్ళు ఆదరించగలరు అనాథుని? ఎవరో పుణ్యాత్ములు ఆవిడికి అంత్యక్రియలు జరిపి పుణ్యాం కట్టుకున్నారు. చనిపోయినప్పుడు ఆవిడ నాకు వదిలిపోయిన ఆస్తి ఒకవజ్రపు వుంగరమూ, అమ్మదీ నాన్నదీ కలిపి తీసిన ఒక ఫోటోనూ. అవిమాత్రం పదిల పరుచుకున్నాను. ఇవి మాతండ్రి (?) నాతోబాటే మా అమ్మకిచ్చిన కానుకట.

అంతే నా జీవితం తెగిన గాలిపటం చందానఅయింది. నా అనేవాళ్ళు ఉన్నా యిప్పుడునాకు తెలియదు. పోల్చుకోలేను. వాళ్లు నన్ను అసలేపోల్చుకోలేరు. నాకు నాన్న లేడు. ఉన్నఅమ్మ పోయింది. ఏకాకిని అయిపోయాను. ఎవరికోసంబ్రతకాలి నేను. ఎందుకు? గమ్యంలేని ప్రయాణమయింది నా బ్రతుకు. దానికి దారీ తెన్నూ లేదు. బజారు మనిషినయినాను.

ఆకలేసినప్పుడు చిన్నచిన్న దొంగతనాలు చేసేవాడిని. తరువాత వయసుతోబాటు నా వృత్తి, ఆశా పెరిగాయి, ఖర్చెక్కువయింది. పెద్ద దొంగతనాలు మొదలుపెట్టాను. ఈ ప్రపంచమంతా నా శత్రువు. దానిమీద తీవ్ర ప్రతీకారం తీర్చుకోవాలనిపించింది. ఆరనిపగ నాలో రగిలింది. ఈ ప్రపంచం నాకు తీరనిఅన్యాయం చేసినట్లు, దానికి ప్రతిగా పగ తీర్చుకునేవాడిని. నాలోని మమత ప్రేమ మొద్దుబారి హృదయం మొండిబండిలా మారిపోయింది.

నేనుచేసిన దోపిడీలతో, హత్యలతో నిన్ను విసుగెత్తించదలచలేదు. నా పగలో యెందరో అధికార్లుకూడా

ఆహుతి అయ్యారు. కాని ఇన్‌స్పెక్టర్! నువ్వు నన్ను పట్టుకున్నావు. ఎందుకుగాని నువ్వు న్యాయ రక్షణకి 'ప్రతిబింబ'మనిపించింది. నిన్ను చంపాలనిపించలేదు. నీకూ—న్యాయానికీ—లొంగిపోవాలనిపించింది. కారణం అడిగితే చెప్పలేను. కొన్ని పనులకి కారణాలు వుండవు.

నేను చేస్తున్నది తప్పని నాకు తెలుసు. కాని చేయకుండా వుండలేక పోయాను. కనుకనే శిక్ష అనుభవించటానికి నేను బాధపడటంలేదు. నేరము చేశాను గనుక శిక్ష అనుభవించాలి: అది సంతోషంగా స్వీకరిస్తాను. ఇన్‌స్పెక్టర్! నేను నలుగురికీ తెలిసేటట్టు నేరంచేశాను. ఇప్పుడు నా చరిత్ర విన్నావు గదా! ఇందులో యెవరికీ తెలియకుండా, కనబడని నేరాలు చేసినా యిప్పటికీ పెద్దమనుషులుగా చలామణీ అయ్యేవాళ్ళు వున్నారు. వాళ్ళని శిక్షించటానికి మీా చట్టం ఏం ఏర్పాట్లు చేసింది? వాళ్ళెవరో గ్రహించగలిగి ఉంటావు ఈ సరికిదీన్ని గురించి ఏమైనా చెయ్యటం నీ వలనా, నా వలనా కాదనుకో. ఎందుకంటే నివు న్యాయరక్షణ యంత్రాంగంలో ఒక భాగానివే. మరి నేను నేరంచేసి శిక్ష అనుభవించ బోతున్నవాడిని. దాన్ని గురించి మాట్లాడటానికి నాకు హక్కులేదు. పశ్చాత్తాపంతో, శిక్షననుభవించడంతో నా పాపం ప్రక్షాళనం అవుతుంది. ముప్ఫయి అయిదేళ్ళకే నూరేళ్లు నిండుతున్నందుకు నాకు బాధలేదు. ఎందుకంటే ఈ జీవితం నేను కోరలేదు యెప్పుడూ. అంటే ఈ జీవితం నాటకరంగంలో నాపాత్ర కొద్దిసేపేనన్నమాట. మాఅమ్మలాగా. అయితే అమెను లోకం బాధపెట్టింది. నేను లోకాన్ని బాధపెట్టాను. అంతే తేడా.

ఇకపోతే ఈ నెలరోజులు నేను ని రిమాండులో వున్న
కాలంలో ఒక పనిమాత్రం చెయ్యగలిగాను. నా తల్లి అత్యంత
పవిత్రంగా చూస్తూవచ్చి ఆ వజ్రపుటుంగరమూ, నా తల్లి
దండ్రులఫోటోలువున్న చిన్న పేటికని నెవరూ చూడకుండా
నీ డ్రాయరుక్రింద ఉంచగలిగాను. ఈ ఉత్తరంచదవగానే దయ
చేసి నువ్వు ఆ పెటికని తెరిచి ఆ రెండువస్తువులనూ కాల్చి
వేయవలసిందిగా కోరుతున్నాను. న్యాయానికి దగ్గరవాడవని
నాకు నీమీదనమ్మకం ఉండటంవలన. నీమీద ఎందువలననో
నాకు సద్భావం కలగటంవలన—కారణం అడిగితే చెప్పలేను
—కొన్నిటికి కారణాలుండవు. నిన్ను నా అత్యంత సన్నిహితు
డుగాభావించి ఈ పని నీకుఅప్పగిస్తున్నాను. నువ్వుఅని సంబో
ధించి చనువుతీసుకున్నందుకు క్షమించవలెను. మన యిద్దరి
మధ్య యేదో తెలియని అనుబంధం వున్నదని నాలో యే
మూలనో అనిపిస్తున్నది. అందువలననే ప్రేమగా పిలవాలని
పించింది. సన్నిహితత్వంకోరాను. చిత్రంగాలేదూ?”

ఉత్తరంముగించి గాఢంగా నిట్టూర్చాడు రాజారావు.
ఆశ్చర్యం వేసింది. ఎంతవిచిత్రమయినకోరిక. యే పాపిష్టి అను
బంధం, తనకి వదనుకున్న జన్మను ప్రసాదించిందో ఆ అనుబంధ
చిహ్నాలయిన ఆ రెండువస్తువులూ గౌరవప్రదంగా రూపుమాప
బడాలని అతను కోరుతున్నాడు. దానిలో ఈ నాటకంలో
అతనిపాత్ర తాలూకు చిహ్నాలుకూడా మాసిపోతాయి,
ఆశ్చర్యపడుతూ కాసేపు కూర్చున్నాడు. తనకీ వాడికీ అనుబం
ధమా? “పూర్ క్రీచర్! అని నవ్వుకున్నాడు: రాజారావులో
ఆ రెండు వస్తువులన్నీ చూడాలని ఉత్సుకత కలిగింది. గబ

గబాలేచి డ్రెస్ మార్చుకున్నాడు. నౌకర్ని లేపి తలుపు వేసుకోమని చెప్పి జీపుని రోడ్డుమీద పరుగెత్తించాడు.

చలికి రాత్రి ఒళ్ళుముడుచుకుని నిద్రపోతున్నది. పావుగంటకి స్టేషన్ చేరుకున్నాడు రాజారావు. తన ఆఫీసరు కుర్చీలో కూర్చుని యేదో రాసుకుంటున్నాడు. బయట విజిటర్స్ రూములో ఎవరో కూర్చునివున్నారు. నైట్ డ్యూటీ ఆఫీసరు శివంకూడా వున్నాడు. కొంచెం ఆశ్చర్యపోయి అతనికి "విష్" చేశాడు. "ఏమిటి రాజారావుగారూ!" ఇప్పుడెందుకొచ్చారన్నట్టు కన్నెగరేశాడు అతడు

"ఏం లేదండీ. నిద్రపట్టకపోతే కాసేపు"...శివందగ్గరకు వెళ్ళాడు.

"ఐసీ...!" అని ఆయన తలవంచుకుని ఏదో రాసుకోసాగాడు. శివంకోసం వచ్చానన్న రాజారావు తిన్నగా శివం దగ్గరకు వెళ్ళక తన టేబులుదగ్గరకు వెళ్ళి కుర్చీలో కూర్చున్నాడు. ఇది గమనించి ఆఫీసరు తిరిగి రాసుకోసాగాడు.

రాజారావు కుర్చీలో కూర్చుని టేబులుక్రింద చెయ్యిపెట్టి తనకు కావల్సిన దానికోసం వెతికాడు. చిన్న పేటిక దొరికింది కాసేపు వెతికాక. అది తీసుకుని, ఆఫీసరు టేబులు దగ్గరకువచ్చి "సెల్యూట్" చేసి "ఖైదీ నం. 111ని ఉరి తీశారా సార్" అని అడిగాడు.

"అవును. ఏం?" అన్నాడు తలయెత్తి ఆఫీసరు.

"ఏం లేదు. అతను చిత్రమయిన వ్యక్తిలా ఉన్నాడు. ఈ వుత్తరంలో" అంటూ పేకటితిసి ఫోటో, వుంగరమూ బయటికితీసి ఆ ఫోటోవంక చూడసాగాడు అదేపనిగా.

"ఊఁ వృత్తరంలో..." అని "ఏమిటి చూస్తున్నారు?" అని చేతిలో ఫోటో తీసుకుని పరీక్షగా చూడసాగారు.

రాజారావు మొహం తెల్లగా అయింది. వణికిపోతు న్నాడు. చేతిలో ఉంగరం తీసుకుని దానివంకే వెర్రిగా చూడ సాగాడు. అతనిలో తీవ్రచలనం కలిగింది. పిచ్చిగాచూస్తూ నిలబడిపోయాడు.

"ఊఁ ఏమండీ? ఈ ఫోటో మీదేననుకుంటాను. ప్రక్కన యెవరు? చిత్రం ఉందిః ఆవిడ మీ భార్యా? ఆవిడ యిలా వుండదే?" అంటూ తలవంచుకుని క్రీగంట చూస్తూ చెప్పుకు పోతున్నాడు.

ఇంతలో ప్రక్కగదిలోంచి తలనెరిసిన, సూటు వేసు కున్న ఒక ముసలాయన ఆయాసపడుతూవచ్చి రాజారావు కొరుకుతూన్న వజ్రపు ఉంగరాన్ని విసురుగా కొట్టాడు. ఉంగ రం యెగిరివెళ్ళి శివం టేబులుః మీద పడింది. ఇది చూసి శివం ఆయనమీదికి రాబోయాడు ఉద్రేకంగా. గవర్నమెంట్ ఆఫీ సర్లమీద, ఆఫీసులోనే దౌర్జన్యమా?

హఠాత్తుగా ఆఫీసరు ఉరుములా గర్జించాడు. ఇద్దరు మెసెన్జర్ పోజకొచ్చి సెల్యూట్ కొట్టారు.

ప్రక్కగదిలోంచి వెక్కిళ్ళు వినిపిస్తున్నాయి. ఎవరో స్త్రీ ఏడుపునాపుకుంటున్నది ఆఫీసరు చెప్పసాగాడు.

"మిస్టర్! రాజారావు. తలచుకుంటే నిన్ను ఆత్మ హత్యా నేర క్రింద అరెస్టు చేయించగలను. అయితే యిం దులో కొంత కల్పన జమచేసి నిన్నుమభ్యపెట్టడానికి అనుమతి యిచ్చి దానికి నేనూ కొంత బాధ్యుడనయినందున నన్ను

క్షమించవలసింది. ఈ ఉద్రేకంలో నువ్వు యింకో స్త్రీకి ద్రోహం చెయ్యబోయావు ఆలోచన లేకుండా.

పోతే అసలుకథ ఆ విధంగా జరగలేదు. ఇక్కడ నీకు నిజం చెప్పాలి. ఇందాకవచ్చి నీ ఆత్మహత్యా ప్రయత్నాన్ని భగ్నంచేసినవారు, ఒకనాడు నీచే మోసగింపబడిన "శారదమ్మ" అన్నగారు. వయస్సుచెచ్చిన మార్పులవలన మీరు పోల్చుకోలేకపోయారుగాని ఆయన మిమ్మల్ని పోల్చుకున్నారు. అయితే మిమ్మల్ని తిరిగి కలుసుకోవడం ఆ అన్నాచెల్లెళ్ళకి యిష్టంలేదు. ఇకపోతే శారదమ్మగారి అబ్బాయి నాకు స్నేహితుడు. ఒకనాడు మాటల సందర్భంలో నాకు ఈ ఫొటో చూపించటంవలన, మిమ్మల్ని పోల్చుకోగలిగాను అయితే ఈ నాటకంలో వాళ్ళకి యేమీ సంబంధంలేదు. నేనే రచ్చన్నాను. వాళ్ళని, మిమ్మల్ని చూపిద్దామని. ఇందులో కాస్త చొరవతీసుకున్నాను నేను.

ఇక అసలుకథ ఏమిటంటే... "శారదా" అంటూ నాలుగడుగులు 'విజిటర్స్‌రూమ్'వయిపు నడవసాగాడు రాజారావు అప్పటికే.

ఆఫీసరు గర్జించాడు "సి. టి. నం.1 నువ్వు ఆఫీసులో ఉన్నసంగతి మరిచిపోతున్నావు. స్టాప్."

యంత్రంలాగా సావధానంగా నిలబడ్డాడు రాజారావు సిరుత్తరుడై.

"పూర్తిగా అసలుకథ వినండి. అందులో వ్రాయబడింది కల్పనాకథ మాత్రమే. నిజంగా జరిగినది యేమంటే ఆమె తిరిగి అన్నగారివద్దకువెళ్ళి బిడ్డను చూసుకుంటూ బిడ

లోనే పతివి చూసుకుంటూ ఆదిశేషుడువంటి అన్న వుండగా కాకులవంటి లోకులు దరిచేరటానికి సాహసించలేదు. ఇన్నేళ్ళూ బిడ్డని చూసుకుంటూ పూర్ణిమలా విరహాన్ని దుఃఖాన్ని భరించివుంది. నిన్ను శపించలేదు. పోతే ఉదయం ఉరితీయబడినాడన్న నేరస్థుడు నీ కొడుకుకాదు. అతనికీ ఈ కథకీ సంబంధంలేదు. అసలు అతన్ని ఉరి తీయిలేదు. యావజ్జీవ కారాగార శిక్షగా మార్చారు.

"థ్యాంక్యూసార్." సెల్యూట్ కొట్టాడు రాజారావు.

ఈలోగా బయటివాళ్ళిద్దరూ కారెక్కారు. రాజారావు గబగబా కారువద్దకు పరుగుతీశాడు. నోరు పెగలలేదు, లోపల శారద దుఃఖమూర్తియై కూర్చునివున్నది. ఆమె అన్నగారు ముఖంతిప్పుకుని కూర్చున్నారు. కారు స్టార్టుచెయ్యటానికి ఆత్రుత పడుతున్నాడాయన. రాజారావు మెదడు స్తంభించిపోయింది. ఏదో చెబుదామని చెప్పలేక అలాగే నిలబడి ఆమెమొహంలోకి చూస్తూ ఉండిపోయాడు. ఆ కాస్సేపు నిశ్శబ్దం మాట్లాడింది. కారు స్టార్టు అయింది. రాజారావు కళ్ళవెంబడి కన్నీరు ధారపోతగా కురిసింది. "శారదా! నాకింత శిక్షా!" అని అరిచాడు పిచ్చిగా "నేరం చేసినప్పుడు శిక్ష అనుభవించక తప్పదు" ఆయన అరిచాడు. కారులోంచి కారు బయలుదేరింది. లోపల్నించి వెక్కిళ్ళు వినిపించాయి అతన్ని గుండెల్ని పిండుతూ.

కళ్ళుతిరిగి పడిపోతూంటే శివం పరుగెత్తుకువచ్చి రాజారావుని పట్టుకున్నాడు.

అప్పటికి ఆఫీసరూ వచ్చి సాయంచేశాడు. ఇద్దరూ కలిసి ఒకకప్పు కాఫీ పట్టించారు అతనికి.

“అయితేసార్! మీరు రేపు వెళ్ళిపోవడం ఖాయమేనా?” అడిగాడు శివం కుతూహలంగా. అవునండి అంతా నిశ్చయమై పోయింది. ఇప్పుడు చేసేదేమీలేదు.” అని నవ్వాడు ఆఫీసరు. కారు స్టార్టుచేసుకుని ఆఫీసరుగారు వెళ్ళిపోయారు. శివం రాజారావుని ఇంటికి చేర్చాడు.

మర్నాడు ఆఫీసరుగారు ఛార్జీ అప్పగించి వెళ్ళిపోయారు, రాజారావు ఇంట్లోనుంచి కదలలేదు. ఆలోచిస్తూ పిచ్చిగా ఉండిపోయాడు సెలవుపెట్టి.

గతరాత్రినుంచి నీరసంగా ఉన్న రాజారావులో సన్న సన్నగా ఉద్భవించి పెరిగి బలవత్తరమవుతూంది. ఒక కోరిక. ఆఫీసరుగార్నడగటానికి సిగ్గువేసింది. అతను బాగా నీరసించిపోయాడు అతనిప్రాణం గిలగిలలాడుతోంది దేన్నో తెలుసుకోవటానికికి శివంవచ్చాడు చూసిపోవడానికి.

మాటలు మింగుతూ అడిగాడు శివాన్ని “మరి... మావాడు...?” అంతకన్నా వివరంగా అడగటానికి సిగ్గేసింది పకాలున నవ్వాడు శివం. “అయితే నువ్వు పోల్చుకోలా? ఇది వరకు శారదమ్మని చూడక పూర్వం తెలియలేదుగాని, ఇప్పుడు చూస్తే ఆవిడగారి పోలికలు మన ఆఫీసరు...” అంతే అంతవరకుమాత్రమే విన్నాడు రాజారావు. మరివినలేక పోయాడు.